# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు దృశ్యమాధ్యమ విధానంలో శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **గ్రామీణాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని పేర్కొన్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ.**

3. **దేశ, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చిన కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు.**

4. **నదుల పరిరక్షణకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని అధికారులను ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో ఈరోజు పర్యటిస్తున్నారు. నగరంలోని స్వరాజ్య మైదానంలో 85 కోట్ల రూపాయలతో అత్యాధునిక వసతులతో నిర్మించిన 'అంబేద్కర్ కళావేదిక'ను ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సదస్సు - 2026ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 38 ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి దృశ్యమాధ్యమ విధానంలో శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాల విస్తరణ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటి అంశాలపై సదస్సులో చర్చించారు.

-------------------------

గ్రామీణాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కేంద్ర భారీ ఉక్కు, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరంలో 40 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, 20 లక్షల 80 వేలతో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో కలిసి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.

-------------------------

దేశ, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలోని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఈరోజు ఉదయం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగ నాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.30.. సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2027 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రదానం చేయనున్న పద్మ అవార్డులకు అర్హులైన వ్యక్తుల నుంచి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి, శిక్షణా సంఘం-సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం. రమ్య ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్ & ఇంజినీరింగ్, ప్రజా వ్యవహారాలు, ఇతర పౌర సేవలు, పరిశ్రమలు, వాణిజ్యం తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారు ఈ అవార్డులకు అర్హులని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో పాటు దరఖాస్తులను అధికారిక వెబ్ సైట్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు.

---------------------------

నదుల పరిరక్షణకు ఈరోజు నుంచే కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గోదావరి నదిలో పుష్కర ఘాట్ల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల గురించి ఉప ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ కీర్తి వివరించారు. అనంతరం పుష్కర్‌ఘాట్ నుంచి కోటిలింగాల రేవు వరకు పవన్ కల్యాణ్ బోటులో వెళ్లారు. అనంతరం రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని అధికారులతో, ప్రజా ప్రతినిధులతో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి వాస్తవాధారిత వివరాలతో వినతులు సమర్పించాలని డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సూచించారు. కడప కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రజలు, కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు ఈరోజు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ.. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబడిన పరిస్థితులపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. వినతులతో పాటు ఆధారాలు, గణాంకాలు, ధృవీకరణ పత్రాలు కూడా సమర్పించాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే హస్త కళలకు విస్తృత ప్రాచుర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. హస్త కళలకు మార్కెట్

విస్తరించడంతో కళాకారులకు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దిశగా 'తరంగా' అనే ఏఐ ఆధారిత రియల్ టైమ్ పర్యవేక్షణ వ్యవస్థతో పాటు, 'కళాక్షి' పేరుతో వాట్సాప్ వ్యవస్థను రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే వెబ్‌సైట్ అందుబాటులో ఉందని తెలిపారు. వినియోగదారులు కోరిన హస్త కళా ఉత్పత్తులను నేరుగా వారి ఇళ్లకే చేరవేసే ఉద్దేశంతో ఎఐ టూల్స్ ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు

---------------------------

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అధిక స్థాయిలో నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, రానున్న మూడు రోజులు పాటు ఇదే తీవ్రత కొనసాగే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ  మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈరోజు 29 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 166 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని కొన్నిప్రాంతాల్లో 45 నుంచి 47 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర– 2026 పేరుతో నిర్వహించనుంది. జూన్ 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ప్రచారాలు నిర్వహించి, జూన్ 21వ తేదీన అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒక్కో జిల్లాలో ప్రత్యేకంగా యోగాంధ్ర నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసులతో, తూర్పుగోదావరి జిల్లాలో ఖైదీలతో.. ఇలా 28 జిల్లాలకు 28 ప్రత్యేక ఇతివృత్తాలను ఖరారు చేసింది. ప్రతి జిల్లా కేంద్రంలో వెయ్యి మంది చొప్పున పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తోంది.

---------------------------

అంతర్జాతీయ మిస్సింగ్ చిల్డ్రన్స్ డేని ప్రతి సంవత్సరం మే 25వ తేదీన ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. కనిపించకుండా పోయిన పిల్లల సమస్యపై అవగాహన పెంచడం, పిల్లల భద్రతను బలోపేతం చేయడం, బాధిత కుటుంబాలకు మద్దతు ఇవ్వడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేలాది మంది పిల్లలు వివిధ కారణాల వల్ల కనిపించకుండా ఉంటున్నారు. కొంతమంది పిల్లలు ఇంటి నుంచి తప్పిపోతుండగా, మరికొందరు కిడ్నాపింగ్, మానవ అక్రమ రవాణా, ఆన్‌లైన్ మోసాలు లేదా కుటుంబ సమస్యల కారణంగా అదృశ్యమవుతున్నారు. పిల్లలు ఏ దేశానికైనా భవిష్యత్తు వంటి వారు. వారిని సురక్షితంగా ఉంచడం కుటుంబం, సమాజం, ప్రభుత్వాల బాధ్యత అని తెలియజేయడం ఈ ప్రత్యేక దినోత్సవ ముఖ్యోద్దేశం.

=====================